కూటమి నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం

- అసంపూర్తిగా అదనపు తరగతి గదుల భవన నిర్మాణాలు
- నాడు–నేడు ఫేజ్–2లో గత ప్రభుత్వం రూ.4.18 కోట్ల మంజూరు
- వివిధ దశల్లో 35 అదనపు తరగతి గదుల నిర్మాణాలు
- నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



నూజివీడులోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్లో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులు

నూజివీడు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు రెండో విడతలో భాగంగా నూజివీడు మండలంలోని పలు హైస్కూళ్లలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. భవనాల నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉండగా వాటిని అలాగే వదిలి వేయడంతో లక్షలాది రూపాయల ప్రజాధానం వృథా అయ్యే పరిస్థితి నెలకొంది. నాడు–నేడు రెండో విడతలో మండలంలోని పలు హైస్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి, సరిపడా తరగతి గదులు లేని పాఠశాలలను గుర్తించి ఆయా పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి అప్పట్లో శ్రీకారం చుట్టింది.

నూజివీడు మండలానికి రూ.4.18 కోట్లు మంజూరు

నాడు–నేడు ఫేజ్–2లో ప్రభుత్వ పాఠశాలల్లో అదీ ముఖ్యంగా హైస్కూళ్లలో అదనపు తరగతి గదులను నిర్మించేందుకు నూజివీడు మండలానికి రూ.4.18 కోట్లను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో 35 అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్లో రూ.1.44కోట్లతో 12 తరగతి గదులను, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌లో రూ.1.08 కోట్లతో 9 తరగతి గదులను, గొల్లపల్లి హైస్కూల్లో రూ.94 లక్షలతో 8 తరగతి గదులను, మీర్జాపురం హైస్కూల్లో రూ.72 లక్షలతో 6 తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసే నాటికి ప్రతి పాఠశాలలో ఈ అదనపు తరగతి గదుల భవనాలు 60 శాతం నుంచి 80 శాతం వరకు నిర్మాణ పనులను పూర్తి చేసుకున్నాయి. కొన్ని చోట్ల కిటికీలు, తలుపులు పెడితే పనులు పూర్తవుతాయి. మరికొన్ని చోట్ల మొదటి అంతస్తు నిర్మాణ పనులు పూర్తి కాగా, రెండో అంతస్తు నిర్మాణ పనులు మధ్యలో ఉన్నాయి.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వ పాలన ప్రారంభమై 13 నెలలు గడిచినా జెడ్పీ హైస్కూళ్లలో పలు దశల్లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. వీటిపై ఇప్పటి వరకు ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్లో బాలికల జూనియర్ కళాశాలను సైతం ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఎస్ఆర్ఆర్ హైస్కూల్లో అదనపు తరగతి గదుల అవసరం ఉంది. అయినప్పటికీ పట్టించుకోకుండా ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలి



నాడు–నేడు ఫేజ్–2లో ప్రారంభించిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయాలి. తద్వారా హైస్కూళ్లలో తరగతి గదుల కొరత తీరి విద్యార్థులకు సదుపాయం సమకూరుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచినా పట్టించుకోకపోవడం సమంజసం కాదు.

–ఉన్నం అనిల్‌కుమార్, ఐసా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నూజివీడు

క్లుప్తంగా

పంచాయతీ కార్మికురాలిపై దాడిని నిరసిస్తూ ధర్నా

తిరువూరు: మైలవరం పంచాయతీ కార్మికురాలు బిజిలీ భవానీపై దాడి ఘటనను నిరసిస్తూ తిరువూరు నగర పంచాయతీ ఎదుట గురువారం పారిశుద్ధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. దాడికి పాల్పడిన కటారి ఉమామహేశ్వరరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, బాధితురాలికి రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి. వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మహిళా కార్మికురాలిపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, కార్మికులపై దాడులు అరికట్టాలని కోరారు. సీఐటీయూ నాయకులు ఆకుల రవి, రమణ, సామ్రాజ్యం, కృష్ణవేణి, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

తిరువూరు: స్థానిక రాజ్యలక్ష్మి సమేత రంగనాయక స్వామి దేవాలయంలో గురువారం సుదర్శన హోమం నిర్వహించారు. సుదర్శన పెరుమాళ్ తిరునక్షత్ర సందర్భంగా సేవాకాలం, బాల భోగ నివేదన, శాత్తుమురై, తిరుమంజనం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం అనంతరం సుదర్శన హోమం జరిపి పూర్ణాహుతితో ముగించారు. ఆలయ ధర్మకర్త దారా రంగారావు పర్యవేక్షించారు.

పీహెచ్‌డీ ప్రదానం

ఆగిరిపల్లి: మండలంలోని పోతవరప్పాడు ఎస్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న చింతా వెంకట మురళీకృష్ణ గీతం యూనివర్సిటీ ద్వారా పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ నాగభాస్కర్ తదితరులు ఆయనను అభినందించారు.

4న దత్తసాయి మందిర ప్రతిష్ఠ



తిరువూరు: ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో నూతనంగా నిర్మించిన శివ దత్తసాయి మందిర ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రత్యేక హోమాలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆగస్టు 2న గ్రామోత్సవం, 4న ఉదయం 8 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తామని దాతలు తెలిపారు. సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించిన శివదత్త సాయి మందిరంలో శివలింగం, నంది, వినాయకుడు, దత్తాత్రేయ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నామని చెప్పారు.

శాటిలైట్ రోవర్‌తో ఇళ్ల సర్వే

చాట్రాయి: శాటిలైట్ రోవర్‌తో ఇళ్ల సర్వే చేపడుతున్నామని సర్వే శిక్షకులు ఎస్కే అబీద్ తెలిపారు. గురువారం మండలంలోని చాట్రాయి సచివాలయంలో సర్వేలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 14,780 గృహాలు ఉన్నాయని చెప్పారు. వీటిని 50 శాటిలైట్లతో అనుసంధానం చేసి సర్వే నిర్వహిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

ఆగిరిపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష ఏఎంఓ రెడ్డి రామారావు సూచించారు. మండలంలోని తోటపల్లి హీల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. శిక్షణ పొందిన ప్రధానోపాధ్యాయులు హీల్ సంస్థ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్‌కు రూ.1,02,500 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కొవ్వలి ఆనంద్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ముసునూరు: లోపూడిలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన, సర్పంచ్ పేరం కృష్ణ, గ్రామ పెద్దలు, దాతలతో కలిసి ముత్యాలమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి పూజాదికాలు నిర్వహించారు. అనంతరం 3,000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలి

తిరువూరు: విద్యుత్ వినియోగదారులపై అధిక భారం మోపే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని గురువారం తిరువూరు సుందరయ్య భవన్‌లో జరిగిన ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం విజ్ఞప్తి చేసింది. ఇళ్ల వద్దకు వచ్చి స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తే వినియోగదారులు అంగీకరించవద్దని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం. నాగేంద్రప్రసాద్ కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పల్లెపాటి శ్రీనివాసరావు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాల పంపిణీ

తిరువూరు: ఇంగ్లిష్ భాషపై ఉన్న భయాన్ని విద్యార్థులు పోగొట్టుకునేందుకు స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలు ఉపకరిస్తాయని ఎ.కొండూరు మండలం కోడూరు ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు రాంప్రదీప్ అన్నారు. గురువారం పాఠశాల విద్యార్థులకు రాంప్రదీప్ స్వయంగా రూపొందించిన స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను పంపిణీ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై కొనసాగిన శిక్షణ

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): విజయవాడ సబ్ డివిజన్ పరిధి మండలాలకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులకు కేతనకొండ రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం మూడో రోజు గురువారం కొనసాగింది. ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కార్యాలయం అధికారి అరుణ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయం ముందుకు తీసుకువెళ్లే విధానాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో ఆచరించాల్సిన తొమ్మిది సార్వత్రిక సూత్రాలను తెలిపారు. ఇబ్రహీంపట్నం వ్యవసాయాధికారి రజని, వివిధ మండలాల ఏఓలు, ఉద్యాన శాఖాధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరువూరు: గంపలగూడెం మండలంలో కొత్త విద్యుత్ లైన్ల నిర్మాణ పనులు జరుగుతున్నందున శుక్రవారం ఉదయం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. గంపలగూడెం పట్టణంతో పాటు గుళ్లపూడి ఫీడర్, పెనుగొలను, ఊటుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

బాబు మోసాలను ప్రజలకు తెలియజేద్దాం

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



తోటమూలలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: అలవికాని వాగ్దానాలు చేసి ఎన్నికల్లో గెలిచిన టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమ నిర్వహణపై గురువారం గంపలగూడెం మండల పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశాన్ని తోటమూలలో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కావూరి వినయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వామిదాసు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమలులో విఫలమైన చంద్రబాబు వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తూ ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తల్లికి వందనం అమలులో చతికిలబడిన చంద్రబాబు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభంలో మూడడుగులు ముందుకు ఆరడుగులు వెనక్కి వేస్తున్నారని దుయ్యబట్టారు. పాఠశాల విద్యార్థులకిచ్చిన స్కూలు బ్యాగులు నెల రోజులకే చిరిగిపోయాయని, మధ్యాహ్న భోజనం నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని విమర్శించారు. ఆడపడుచులకు నెలకు రూ.1,500 చొప్పున, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున ఇస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఆర్థిక పరిస్థితి సహకరించట్లేదని దాటవేస్తున్నారన్నారు. తిరువూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తెలియజేసి ప్రజలను చైతన్యపరిచేందుకు బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం చేపట్టామని వివరించారు.

గంపలగూడెం, తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు శామ్యూల్, రామచంద్రా రెడ్డి, మాజీ ఎంపీపీ కోటదాసు, నాయకులు ఆలపాటి ఉమామహేశ్వరరావు, చావా వెంకటేశ్వరరావు, చెరుకు నరసారెడ్డి, మందపాటి ఉమామహేశ్వరరెడ్డి, వంగల వైకుంఠం, వెంకటేశ్వరరెడ్డి, మోదుగు ప్రసాద్, చెన్న కేశవరెడ్డి, యరదేశి రామారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ దౌర్జన్యాలను ఎదుర్కొంటాం: స్వామిదాసు



రఘు కుటుంబాన్ని పరామర్శిస్తున్న స్వామిదాసు

తిరువూరు: అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల ఆగడాలు మితిమీరి పోతున్నాయని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దౌర్జన్యాలు, దాడులకు పాల్పడటం వారికి అలవాటైందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. ఇటీవల గంపలగూడెం మండలం నెమలిలో వైఎస్సార్ సీపీ కార్యకర్త తురకా రఘు ఇంటిపై దౌర్జన్యం చేసి టీడీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడిన ఘటన నేపథ్యంలో స్వామిదాసు బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. చట్ట వ్యతిరేకంగా ఆస్తులను ధ్వంసం చేయడం, స్వాధీనం చేసుకోవడానికి టీడీపీ నేతలు ప్రయత్నిస్తే తగు రీతిలో గుణపాఠం చెబుతామని స్వామిదాసు హెచ్చరించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కావూరి వినయ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చూడాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ–2 జమలయ్య

నూజివీడు: విద్యార్థులు బడికి రాకపోతే ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారమందించడంతో పాటు బడికి రాకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకోవాలని ఎంఈఓ–2 జమలయ్య పేర్కొన్నారు. మండలంలోని అన్నవరం హైస్కూల్‌ను ఎంఈఓ–2 గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవసరమైతే ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను కలిసి చెప్పాలన్నారు. సమయపాలన పాటించడంతో పాటు అంకితభావంతో విధులు నిర్వహించాలని చెప్పారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇప్పటి నుంచే శ్రద్ధగా చదవడం ద్వారా పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయుడు ఎప్పటి సిలబస్‌ను అప్పుడే పూర్తి చేసి విద్యార్థులతో నిరంతరం అభ్యసన ప్రక్రియ చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోతాదు ప్రకారం ఎరువులు వాడాలి



ప్రకృతి వ్యవసాయ ప్రదర్శనను పరిశీలిస్తున్న ఉషాకుమారి

చాట్రాయి: పంటలకు తగిన మోతాదులోనే ఎరువులు వాడాలని జిల్లా రైతు వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎం.ఉషాకుమారి అన్నారు. గురువారం మండలంలోని ఆరుగొలనుపేట గ్రామంలో వరిలో సస్యరక్షణ చర్యలపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎక్కువ మోతాదులో కలుపు మందులు వాడరాదని, పంటలకు సేంద్రియ కర్బనం చాలా అవసరమని, ప్రతి రైతు ఎండిన పశువుల ఎరువును వాడాలని సూచించారు. ప్రకృతిలో లభించే వనరులు జీవామృతం, ఘనామృతం, నీమాస్త్రం, వేప నూనెలను వాడితే రైతులకు ఖర్చు తగ్గి నాణ్యమైన పంటలను పండించుకోవచ్చని చెప్పారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ విద్యాసాగర్, వ్యవసాయాధికారి బి.శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీని సందర్శించిన ఎంపీడీఓ

నూజివీడు: మండలంలోని యనమదల ఎస్టీ కాలనీని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ గురువారం సందర్శించారు. మంచినీటి ఇబ్బంది, డ్రెయినేజీ సమస్యలను ఎంపీడీఓ దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. ఆయన మాట్లాడుతూ మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. వీధుల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ గృహాల ప్రాంతాల్లో సీసీ డ్రెయినేజీలు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. సర్పంచి వరికూటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మినీ షెడ్డు ప్రారంభం

ముసునూరు: పేదలే దాతలై సామాజిక అవసరం కోసం మినీ షెడ్డు నిర్మించుకోవడం అభినందనీయమని హెచ్ఎం దేవరపల్లి బెనర్జీ అన్నారు.గోగులంపాడు కొత్తూరు యాదవ బజారులో స్థానికులు తమ సొంత నిధులు రూ.40 వేలతో నిర్మించిన సామాజిక అవసరాల మినీ షెడ్డు, సిమెంట్ బెంచీలను దాతలతో కలిసి గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిర్మాణ దాతలను సత్కరించారు.

రీ సర్వే రద్దు చేయాలని రైతుల వినతి



చాట్రాయి: భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణరాజ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని కొత్తగూడెం రైతులతో రీ సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సుమారు 850 ఎకరాలు ఉండగా 250 ఎకరాల్లో రీ సర్వే తప్పులు ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. కాగా తమ గ్రామంలో నిర్వహించిన రీ సర్వేను రద్దు చేసి మళ్లీ చేయాలని రీ సర్వేలో లోపాల వలన ఈ క్రాప్ అవ్వక బ్యాంకులో రుణాలు పొందలేకపోతున్నామని రైతులు సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భద్రూ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా సుంకాల భారాన్ని వ్యతిరేకించండి

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్

నూజివీడు: అమెరికా సామ్రాజ్యవాద దోపిడీకి ఆగస్టు ఒకటి నుంచి తెరలేపారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. భారత దేశంపై 25 శాతం సుంకం విధిస్తూ నిర్ణయం తీసుకున్న అమెరికా దేశాధ్యక్షుడు ట్రంపు చర్యలను ఖండిస్తూ బహిరంగంగా, పార్లమెంటు సమావేశాల ద్వారా ప్రధాని నరేంద్రమోదీ ప్రకటన చేయాలన్నారు. భారతదేశం తమకు మిత్ర దేశం అంటూనే ట్రంప్ సుంకాలు విధించడం అన్యాయం కాదా అని ప్రశ్నించారు. వ్యవసాయం, పాడి పరిశ్రమలు, ఆహార మార్కెట్ రంగాల దిగుమతులకు అమెరికాకు మోదీ ద్వారాలు తెరవడం ద్వారా దేశ రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయని హరినాథ్ ఆవేదన వ్యక్తం చేశారు.

రామకోటేశ్వరరావు సేవలు అభినందనీయం

నూజివీడు: దేవదాయశాఖలో 37 ఏళ్ల పాటు పలు విభాగాల్లో పనిచేసి రికార్డు అసిస్టెంట్‌గా రిటైర్ అవుతున్న మేకా రామకోటేశ్వరరావు సేవలు అభినందనీయమని నూజివీడు మండలం గొల్లపల్లి రఘునాథస్వామి ఆలయ ఈఓ నల్లూరి సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక ఆలయంలో గురువారం రిటైర్ అవుతున్న మేకా రామకోటేశ్వరరావు దంపతులను ఆయన ఘనంగా సత్కరించారు.

ఆర్థిక సాయం అందజేత

విస్సన్నపేట: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎం. రాజారావు అనారోగ్యంతో విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో బుధవారం మృతిచెందారు. విజయవాడ దేవీనగర్‌లో మృతుడి నివాసం వద్ద సీఐ కె. గిరిబాబు, ఎస్ఐ జి. రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు రూ.25 వేలు, ఫ్లాగ్‌ఫండ్ రూ.25 వేలు, విడో ఫండ్ రూ.50 వేలను మృతుని కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమయ్య పాల్గొన్నారు.

పీఎం మత్స్య కిసాన్ సమృద్ధి యోజన వరం

ఇబ్రహీంపట్నం: ప్రధాన మంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ యోజనను సద్వినియోగం చేసుకోవాలని ఆ పథకం కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. ఇబ్రహీంపట్నం వెలుగు కార్యాలయంలో పీఎం ఎంకేఎస్ఎస్‌వై పథకంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పథకం ద్వారా మత్స్య రంగాన్ని ఆధునికీకరించడం, సూక్ష్మ చిన్న తరహా మత్స్య పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పథకంతో మత్స్య రంగానికి చేకూర్చే రాయితీల ద్వారా భద్రత కలుగుతుందని చెప్పారు. సన్న చిన్నకారు మత్స్యసాగు రైతులకు ఈ పథకం వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి చక్రాణీ, ఆప్కాప్ ఎండీ సురేష్, జీఎం పెద్దిబాబు, ఎన్ఎఫ్‌డీసీ రీజినల్ కో–ఆర్డినేటర్ గోస్వామి, రైతులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

విస్సన్నపేట: స్థానిక లక్ష్మీటాకీస్ సెంటర్ వద్ద గురువారం రాత్రి దోమల నివారణ మందు పిచికారీ చేశారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి అన్నారు. మండల వైద్యాధికారి కె. శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, వార్డు సభ్యులు నెక్కళపు కుటుంబరావు, లకుం పవన్, కోటేశ్వరరావు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనా చరిత్ర అంతా మోసమే

మాజీ మంత్రి జోగి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న జోగి రమేష్

రెడ్డిగూడెం(జి.కొండూరు): అబద్ధపు హామీలతో ప్రజలను వంచించడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్ ధ్వజమెత్తారు. రెడ్డిగూడెంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంపై పార్టీ శ్రేణులతో విస్తృతస్థాయి సమావేశం మండల అధ్యక్షుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి అధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ స్క్రీన్ ప్రజెంటేషన్ చేయించారు. ప్రజాభిప్రాయ సేకరణ చేసే యాప్ గురించి పార్టీ శ్రేణులకు వివరించారు. జోగి రమేష్ మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేని చంద్రబాబు, అక్రమ కేసులు పెట్టి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక తన కుమారుడిపై కేసులు పెట్టి వేధించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా తల వంచేది లేదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని, జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా కొనసాగిందని, నేడు కేసులు, దాడులు, రేపులు, మర్డర్లు తప్ప రాష్ట్రంలో మరేమీ లేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను పరుగులు పెట్టిస్తే నేడు ఈ వ్యవస్థలన్నీ కుంటుపడి పేద ప్రజలు నరకయాతన పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పథకాలపై కానీ, సమస్యలపై కానీ ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధించే పనిలో ప్రభుత్వం నిమగ్నమవడం దుర్మార్గమన్నారు. నాయకులంతా ధైర్యంగా ఉండాలని, పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పని చేసి మైలవరం గడ్డపై మరోసారి వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేసి జగనన్నకు బహుమతిగా అందిద్దామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం



పీడీ సీజర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ, నాయకులు



హెచ్ఎం విజయబాబును సన్మానిస్తున్న ఎంఈఓలు

జి.కొండూరు: స్థానిక శాగం శివరామిరెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సీజర్ రెడ్డి గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ అభినందన కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, సీనియర్ నాయకుడు వేములకొండ సాంబశివరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సీజర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి దంపతులను సన్మానించారు. పాఠశాల హెచ్ఎం శ్రీలత, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రిటైర్డు హెచ్ఎంకు సన్మానం

తిరువూరు: స్థానిక రాజుపేట ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి. విజయబాబు పదవీ విరమణ సందర్భంగా గురువారం ఆయనకు ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు వీడ్కోలు పలికారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విజయబాబును నగర పంచాయతీ చైర్‌పర్సన్ నిర్మల, ఎంఈఓలు రామకృష్ణ, నరసింహారావు, ఉపాధ్యాయుడు సుధాకర్, సీఆర్‌పీలు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు.

ఉచిత న్యాయ సేవలపై అవగాహన

తిరువూరు: లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సేవ అందించేందుకు రూపొందించిన నూతన మాడ్యూల్స్‌పై న్యాయవాదులు, అధికారులు అవగాహన కలిగి ఉండాలని తిరువూరు ఆర్డీఓ మాధురి అన్నారు. ఆగస్టు 2న గోపాలపురం ఎస్ఎస్ కల్యాణ మండపంలో జరుగనున్న న్యాయ సేవల ప్రచార కార్యక్రమంపై గురువారం ఆర్డీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయ సేవల ప్రచారం నిమిత్తం నిర్వహించే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు పాల్గొంటారని, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈవోలు, పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరుగురికి ఎల్‌ఓసీల అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): మైలవరం నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆరుగురికి శస్త్రచికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.16.30 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ)ని గురువారం స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబసభ్యులకు గురువారం అందజేశారు.